ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- జడ్చర్ల అసెంబ్లీలో 274 పోలింగ్ కేంద్రాలు
- పోలింగ్ కేంద్రాలకు తరలిన ఈవీఎం-వీవీప్యాట్ మిషన్‌లు
- విధుల్లో 1315మంది పోలింగ్ సిబ్బంది
- కేంద్రాల వద్ద 144వసెక్షన్ విధింపు
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పరిశీలించిన కలెక్టర్, ఎన్నికల పరిశీలకులు


డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో వేచి ఉన్న సిబ్బంది


సామగ్రితో సిబ్బంది


పోలింగ్ కేంద్రాలకు తరలుతూ..

జడ్చర్ల టౌన్: తెలంగాణలో సాధారణ ఎన్నికలు గురువారం జరగనున్న నేపథ్యంలో జడ్చర్ల అసెంబ్లీకి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. 274 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఆయా పోలింగ్ స్టేషన్‌లకు సంబంధించిన సిబ్బందికి ఎన్నికల సామగ్రిని అందజేశారు. సెక్టోరియల్ అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల వారీగా పీఓలకు ఈవీఎం, వీవీప్యాట్‌లు, ఇతర సామగ్రి అప్పగించారు. ముందుగా సామగ్రి అందజేసి భోజన విరామం అనంతరం స్ట్రాంగ్‌రూం నుంచి ఈవీఎం, వీవీప్యాట్‌లను తీసుకువచ్చి అప్పగించారు. సామగ్రి జాబితా వారీగా సరిచూసుకున్న పీఓ, ఏపీఓ, ఓపీఓలు వాటితో పాటు కేటాయించిన వాహనాల్లో కేంద్రాలకు చేరుకున్నారు. బుధవారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఎన్నికలు సంబంధించిన ఏర్పాట్లు పూర్తిచేసుకున్నారు. ఉదయం 6గంటల నుంచి మాక్‌పోలింగ్ నిర్వహించి, తదుపరి 7గంటలనుంచి పోలింగ్ ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. సిబ్బంది రాత్రి కేంద్రాల్లో ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలోని జడ్చర్ల, బాలానగర్, రాజాపూర్, నవాబుపేట, మిడ్జిల్, ఊర్కొండ, రాజాపూర్ మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను 29రూట్లుగా విభజించారు. ఆయా రూట్లకు రూట్ అధికారులను నియమించి వారి సారథ్యంలోనే 58 వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు సామగ్రిని పంపించారు. సామగ్రి పంపిణీ కేంద్రం తిరునాళ్లను తలపించేలా మారింది. దాదాపు 3,500 మంది డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో నివేదికను అందజేసి విధుల్లో చేరారు. పోలింగ్ సిబ్బంది 1315, పోలీసులు 600మంది, రెవెన్యూ 300, మున్సిపల్ 150, మైక్రోఅబ్జర్వర్లు 150, వెబ్‌కాస్టింగ్ సిబ్బంది 150, ఇతర సిబ్బంది, అధికారులు 1000మంది వరకు విధులు నిర్వహిస్తున్నారు.

జిల్లా కేంద్రంలో..



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలింగ్, కౌంటింగ్ నిర్వహణలో భాగంగా మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజక వర్గానికి గాను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో ఎన్నికల సామగ్రి పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే జడ్చర్లకు సంబంధించి అక్కడి డాక్టర్ బీఆర్ఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో, దేవరకద్రకు సంబంధించి మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేశారు. ఇక పాలమూరు విశ్వవిద్యాలయం (పీయూ) లోని ఎగ్జామినేషన్ బ్రాంచిలో ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా, బుధవారం ఆయా పంపిణీ కేంద్రాల నుంచి ఎన్నికల సిబ్బంది ఈవీఎంలు, వీప్యాట్‌లను తీసుకుని గ్రామాలకు వెళ్లారు.

గ్రామాలకు వస్తున్న వలస ఓటర్లు

అడ్డాకుల: వలస ఓటర్లు గ్రామాల బాట పట్టారు. హైదరాబాద్, బెంగళూర్, పుణే, ముంబై వంటి మహా నగరాలతో పాటు రాష్ట్రంలోని ఇతర చోట్లకు వలస వెళ్లిన ఓటర్లు బుధవారం బస్సులు, ఇతర వాహనాల్లో గ్రామాలకు తరలి వస్తున్నారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికలు స్థానిక సంస్థల ఎన్నికలను తలపిస్తుండటంతో గ్రామాల్లోని నాయకులు వలస ఓటర్లపై దృష్టి సారించారు. దీనివల్ల వలస ఓటర్లు పెద్ద ఎత్తున తరలివచ్చి ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉంది. కొందరు నేతలు ఓటర్ల కోసం ప్రత్యేకంగా అద్దె వాహనాలను ఏర్పాటు చేయడంతో అటువంటి వారు గురువారమే గ్రామాలకు వచ్చే అవకాశం ఉంది. గ్రామాలకు వస్తున్న ఓటర్లను మచ్చిక చేసుకునే పనిలో నేతలు బిజీగా మారారు. మొత్తం మీద గ్రామాలకు వస్తున్న వలస ఓటర్లతో పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉండగా వారేవరికి మద్దతిస్తారన్న దానిపై చర్చ సాగుతోంది.

పరిశీలించిన జిల్లా కలెక్టర్

సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి రవినాయక్, సాధారణ ఎన్నికల పరిశీలకులు మిశ్రా పరిశీలించారు. పోలింగ్ సందర్భంగా ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని ఆయన పీఓలకు సూచించారు. ఎన్నికల విధులు వేసిన సిబ్బంది ఎట్టిపరిస్థితుల్లోనూ గైర్హాజరు కాకుండా చూసుకోవాలని, రిజర్వ్‌లో ఉండే వారంతా డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లోనే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంపిణీ కార్యక్రమాన్ని రిటర్నింగ్ అధికారి మోహన్‌రావు, ఏఆర్‌ఓ సత్యనారాయణెడ్డి, ఎంఈఓ మంజులాదేవిలు పర్యవేక్షించారు. అన్ని మండలాల్లోనూ మాడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. సాధారణ, మహిళా, దివ్యాంగుల మాడల్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి.

పోలింగ్‌బూత్‌లకు చేరిన సిబ్బంది

భూత్పూర్: అసెంబ్లీ ఎన్నికలు గురువారం జరగనున్న నేపథ్యంలో ఎన్నికల సిబ్బంది బుధవారం సాయంత్రం పోలింగ్ బూత్‌లకు సామగ్రితో చేరారు. కాగా మండలంలో 48 బూత్‌లకు గానూ 36,176 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్లు 18,076 కాగా , పురుషులు 18,100 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. వీరు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.



నవాబుపేటలో పురుషులే అధికం

నవాబుపేట:మండలంలో ఓటర్ల సంఖ్యలో మహిళల కంటే పురుషులే అధికంగా ఉన్నారు. మండలంలో 53 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 39,953 మంది ఓటర్లు ఉండగా వాటిలో 19,672 మంది మహిళలు, 20,281 మంది పురుషులు ఉన్నారు. మండలంలో మహిళల కంటే పురుషులే 506 మంది ఓటర్లు అధికంగా ఉండటం విశేషం. ఇదిలా ఉంటే గతంలో 45 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటిలో తాజాగా మరో 8 కేంద్రాలు నవాబుపేట, చౌడూర్, అమ్మపూర్, కారుకొండ గ్రామాల్లో ఒక్కొటి అదనంగా ఏర్పాటు చేశారు.

ఐదు ప్రత్యేక రూట్లు



నవాబుపేట: మండలంలో ఐదు ప్రత్యేక రూట్లు ఏర్పాటు చేసి ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల నిర్వహణ అధికారులు తహసీల్దార్ మల్లికార్జున్‌రావు, ఏఓ కృష్ణకుమార్ బుధవారం వివరించారు. రూట్ల వారిగా సెక్టోరియల్ అధికారులను నియమించి వారి ద్వారా పోలింగ్ పరిశీలన తదితర ఏర్పాట్లు పరిశీలిస్తున్నట్లు తెలిపారు.


మొదటి పోలింగ్ కేంద్రం.. మొదటి ఓటు

జడ్చర్ల నియోజకవర్గంలో
- పోలింగ్ కేంద్రం 1 : కొల్లూర్‌లో
- ఓటర్ క్రమసంఖ్య1 : నర్సిములు జర్పటి
- ఉండేది ఒక చోట .. ఓటు మరో చోట
- జాబితా రూపొందించిన అధికారులపై పలువురి అసహనం

నవాబుపేట: జడ్చర్ల నియోజకవర్గంలో మొత్తం 274 పోలింగ్ కేంద్రాలు ఉండగా మొదటి పోలింగ్ కేంద్రం కొల్లూర్ గ్రామం నుంచి ప్రారంభం అవుతుంది. 1 వ పోలింగ్ కేంద్రం నుంచి 54వ పోలింగ్ స్టేషన్ వరకు నవాబుపేట మండలంలో కొనసాగనున్నాయి. అలాగే రాజాపూర్ మండలంలో 56వ పోలింగ్ కేంద్రం నుంచి 119 వరకు, తరువాత బాలానగర్‌లో 39, జడ్చర్లలో 109, మిడ్జిల్‌లో 31, ఊరుకొండలో 22 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 274 కేంద్రాల్లో 2.20244 ఓటర్లు ఉన్నారు.

మొదటి ఓటరు ఉండేది ఒక చోట .. ఓటు మరో చోట

జడ్చర్ల నియోజకవర్గం ఓటర్ల జాబితాలో గత ఎన్నికలలో మొదటి ఓటు కొల్లూర్ గ్రామం వెంకటేశ్వర తండాకు చెందిన రామకృష్ణ పేరు ఉంది. కాగా తాజాగా జరపటి నర్సింహులు పేరు మొదటి ఓటరుగా నమోదైంది. కాగా నర్సింహులు రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లికి చెందిన వ్యక్తి కావటం విశేషం. గత ఎన్నికలలో మొదటి ఓటరుగా ఉన్న రామకృష్ణ తాజాగా రెండవ నంబర్ ఓటరుగా ఉన్నారు. కాగా నియోజకవర్గం ఓటర్ల జాబితాలో మొదటి ఓటరే పేరు ఒక చోట మండలం మరో చోట ఉండటం సర్వత్రా చర్చనీయంశంగా మారింది. అధికారుల తప్పుగా నమోదు చేశారని చెప్పడానికి ఇంతకంటే ఉదాహరణ ఏం కావాలని పలువురు ప్రశ్నిస్తున్నారు.


ఓటర్ల జాబితాలో పేర్లు

ఓటు ఎవరికి వేస్తారో?

- నాయకుల్లో ఆందోళన

రాజాపూర్: అసెంబ్లీ ఎన్నికల్లో గురువారం ఓటింగ్ ప్రక్రియ జరగనుంది. ఈ నేపథ్యంలో గెలుపు ఎవరి పక్షాన ఉంటుందోనని నాయకులు ఆందోళన పడుతున్నట్లు తెలుస్తోంది. పలువురు నాయకులు ఓటర్ల నాడి అంతుచిక్కక ఆలోచనలో పడ్డట్లు సమాచారం . రాజాపూర్ మండలంలో ముఖ్యంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య పోటీ ఉండబోతున్నదని పలువురు చెబుతున్నారు. అయితే మంగళవారం వరకు ఏ పార్టీ నాయకుడు ప్రచారం నిర్వహించినా.. దాదాపు అన్ని గ్రామాల వారు అన్ని పార్టీల వారి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దీంతో వారు ఎవరికి ఓటు వేస్తారోనన్న అయోమయంలో నాయకులు ఉన్నారు. అయితే బుధవారం వివిధ పార్టీల నాయకులు ఓటర్లకు మద్యంతో పాటు , నగదు గుట్టుచప్పుడు కాకుండా పంపిణీ చేశారన్న ఆరోపణలు వినవస్తున్నాయి.

ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో నాయకులు!

నవాబుపేట: దాదాపుగా నెల రోజులకుపైగా జనం మధ్య బహిరంగంగా కనిపిస్తూ ప్రచారాలు నిర్వహించిన వివిధ పార్టీల నాయక గణం తాజాగా అదృశ్యమైంది. ఉన్నట్టుండి మాయమైన వీరంతా.. గుట్టుచప్పుడు కాకుండా ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. దీంతో గ్రామాల్లో నిశబ్ద వాతావరణం కనిపిస్తోంది. ప్రధానంగా కుల సంఘాల నాయకులకు, మహిళ సంఘాలకు వివిధ పార్టీల నాయకులు తాయిలాలు ప్రకటిస్తున్నట్లు, నగదు, మద్యం తదితరాలు పంపిణీ చేస్తూ తమవైపు తిప్పుకునే పనిలో పడ్డారని సమాచారం. మండలంలో చాపకింద నీరులా సాగుతున్న ఈ ప్రక్రియ సాగుతోంది. మండలంలో ముదిరాజ్, యాదవ, గౌడ, ఎస్సీ, ఎస్టీ ఓటర్లు ఎక్కువగా ఉండటంతో వారిపైనే నాయకులంతా దృష్టిపెట్టి మంతనాలు చేస్తున్నట్లు వినవస్తోంది.

దేవరకద్రలో 289 పోలింగ్ స్టేషన్లు


చిన్నచింతకుంట పోలింగ్ కేంద్రానికి చేరుకున్న పోలింగ్ సిబ్బంది


పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిన చిన్నచింతకుంటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

దేవరకద్ర: నియోజకవర్గంలో పోలింగ్‌కు అధికారులు సర్వంసిద్ధం చేశారు. 8 మండలాల్లో 289 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు సిబ్బందితో పాటు సామగ్రి చేరుకుంది. నియోజకవర్గంలో ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలతో కలిపి మొత్తం 12 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అయితే బుధవారం ఉదయం నుంచి పలువురు అభ్యర్థులు ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ ఓటర్లకు ఎర వేస్తున్నారని.. ఇందుకోసం గ్రామస్థాయి నాయకులను పురమాయించారని తెలుస్తోంది. గుట్టుచప్పుడు కాకుండా డబ్బు, మద్యం ఏరులై పారుతోందని సమాచారం.

ఎనిమిది సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు....

చిన్నచింతకుంట: మండలంలో ఎనిమిదింటిని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా అధికారులు నిర్ధారించారు. వాటిలో చిన్నచింతకుంట 4, అమ్మపురం 2, ముచ్చింతల 2 కేంద్రాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, గట్టి నిఘా ఉంచినట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

భారీ బందోబస్తు

ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కర్ణాటక, ఉత్తరప్రదేశ్ నుంచి 60 మంది ప్రత్యేక పోలీస్ సిబ్బంది వచ్చినట్లు వివరించారు. డీఎస్పీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో స్పెషల్ ట్రైనింగ్ ఫోర్స్, సీఐ ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్స్, ఏడు రూట్ మొబైల్స్ ఉంటాయని వివరించారు.

లీకేజీని బాగు చేశారు

సాక్షి ఎఫెక్ట్..



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎట్టకేలకు 46వ వార్డు పరిధిలోని గంజి నాగయ్యకాలనీ వీధి నం .1 వద్ద లీకేజీ అవుతున్న మిషన్ భగీరథ పైపులైన్‌కు మున్సిపల్ సిబ్బంది మరమ్మతు చేశారు. 'భగీరథ పైపులైన్ లీకేజీ' శీర్షికన ఈనెల 22వ తేదీన 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనికి స్పందించిన మున్సిపల్ అధికారులు అక్కడికి వెళ్లి పైపులైన్ లీకేజీని గుర్తించారు. ఐదడుగుల పొడవునా సీసీరోడ్డును రెండు మీటర్ల లోతు తవ్వి దానిని సరిచేసి గుంతను పూడ్చేశారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

నేడు ప్రత్యేకపూజలు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని సాయినగర్ సకల దేవతల ఆలయంలో గురువారం సాయినాథుడికి ప్రత్యేకపూజలు చేయనున్నారు. ఉదయం సాయివ్రతం, పల్లకీసేవ, మధ్యాహ్నం మహా మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పాలాది రమేష్ తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిపై దాడి

మహబూబ్‌నగర్ క్రైం: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ బూత్‌లో ఎజెంట్‌ను కూర్చోబెట్టే విషయంలో అసభ్యకరంగా తిట్టడంతో పాటు దాడి చేశారని కాంగ్రెస్ నాయకుడు రూరల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం రాత్రి ఫిర్యాదు చేశారు. రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం..మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ ఫయాజ్‌పై బుధవారం ఇద్దరు దాడి చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా బీకే రెడ్డి కాలనీలో పోలింగ్ ఎజెంట్‌ను ఎవరిని కూర్చోపెట్టాలి అనే విషయంపై మహ్మద్ ఫయాజ్‌కు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు వ్యక్తులతో చర్చ జరిగింది. ఈ విషయంలో ఆ ఇద్దరు వ్యక్తులు ఎవరిని కూర్చోబెడితే నీకు ఎందుకు అంటూ తనను అసభ్యపదజాలంతో తిట్టడంతో పాటు చేతులతో దాడి చేశారని బాధితుడు మహ్మద్ ఫయాజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఎస్పీకి వినతి

మక్తల్: కాంగ్రెస్ అభ్యర్థిపై ఫేక్ వీడియోలు తయారుచేసి లేనిపోని విషయాలను సోషల్ మీడియాల్లో వైరల్ చేస్తున్నారని ఆ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు బుధవారం ఎస్పీ యోగేష్ గౌతమ్‌కు వినతి పత్రం అందజేశారు. చర్యలు తీసుకోవాలని కోరారు. బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, కావలి శ్రీహరి ఉన్నారు.

బాదేపల్లి 'శబరిమలై'


అయ్యప్పస్వామి మూలవిరాట్


ఆలయ ప్రాంగణంలో హరిహరుడి విగ్రహం


ఆలయంలో ఏకశిలతో నిర్మించిన 18మెట్లు

జడ్చర్ల టౌన్: కార్తీక మాసం ఆరంభం కాగానే అయ్యప్ప స్వాముల మాలాధారణ ప్రారంభం అవుతుంది. జనవరి సంక్రాంతి పర్వదినం వరకు స్వాములు దీక్షలో ఉండి పూజలు చేస్తూ భక్తిపారవశ్యంలో మునిగితేలుతారు. మాలాధారణ చేసుకున్న భక్తులు 45రోజుల పాటు నిత్యం పూజలు చేసుకుని శబరిమలై వెళ్లి దీక్షను విరమిస్తారు. అయితే శబరిమలై మాదిరిగానే బాదేపల్లి పట్టణంలోనూ అయ్యప్ప స్వామి ఆలయం ఆకట్టుకుంటోంది. జడ్చర్ల-కల్వకుర్తి మార్గంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. 2009లో అప్పటి గ్రామపంచాయతీ పాలకవర్గం ఆలయ నిర్మాణం కోసం స్థలం కేటాయించింది. దాంతో దాతల సాయంతో అయ్యప్పస్వామి సేవాసమితి భక్తబృందం ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించి 2013లో పూర్తిచేశారు. 2013 ఫిబ్రవరి మాసంలో పరిపూర్ణానంద స్వామిచే ఆలయాన్ని ప్రారంభింపజేశారు. నాటి నుంచి నేటి వరకు కార్తీకమాసం ప్రారంభం నుంచి ఆలయంలో 60రోజుల పాటు భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేస్తున్నారు. మాలధారణ చేసుకున్న వారికి అన్నదానం చేస్తుండటంతో వారికి వరంగా మారింది.

ఏకశిలతో నిర్మించిన మెట్లు

ఆలయం వద్ద ఏకశిలతో నిర్మించిన 18మెట్లు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటాయి. శబరిమలైలో ఉన్నట్లుగానే ఏకశిలతో మెట్లు నిర్మించటంతో భక్తులు అదే భక్తిభావంతో మెట్లను పూజిస్తుంటారు. ఆలయ ప్రాంగణంలో 30 అడుగుల హరిహరుడి విగ్రహం మరింతగా చూపరులను కట్టిపడేస్తోంది. రాత్రివేళల్లో విద్యుద్దీపాల వెలుగులో హరిహరుడి విగ్రహం ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఇక్కడ ఇటీవలే లింగాకారంలో శివాలయం నిర్మించారు. మొదటి అంతస్తులో మూల విరాట్‌తోపాటు వినాయకుడు, కుమారస్వామి, జంటనాగులు, మాలికాపురమ్మ విగ్రహాలు ప్రతిష్ఠించారు. ఆలయ గ్రౌండ్‌ఫ్లోర్‌లో జ్ఞానసరస్వతి అమ్మవారి విగ్రహం, ఆంజనేయుడు, నవగ్రహాలు ప్రతిష్ఠించారు. ఆలయంలోని ధ్వజస్తంభం సైతం శబరిమలైలో ఉన్నట్లుగానే ఏర్పాటు చేశారు. టేకుకర్రతో చేసిన ధ్వజస్తంభానికి లోహపు తొడుగు అలంకరించారు. ఆలయంలో ప్రతి బుధవారం పల్లకీసేవ నిర్వహిస్తారు. ఏటా డిసెంబర్ 27న ఆభరణాల ఊరేగింపు, మహాపడిపూజ చేస్తున్నారు. ఈ ఉత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు.

అన్నదానం

ప్రతిఏడాదిలాగానే ఈసారి కూడా అన్నదానం ప్రారంభించినట్లు ఆలయ సేవాసమితి సభ్యులు దాచేపల్లి చంద్రయ్య, బాదేపల్లి రంజిత్‌బాబు, దేవా, తోటారెడ్డి, యెన్నంరమేష్ జగదీశ్వర్‌రెడ్డిలు తెలియజేశారు. జనవరి 8వరకు మధ్యాహ్నం వేళలో అన్నదానం ఉంటుందని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

ముళ్లపొదల్లో కేఎస్పీ కాల్వలు



మరికల్: కోయిల్‌సాగర్ ఆయకట్టుకు సాగునీరు అందించే కాల్వలు ముళ్లపొదల్లో అల్లుకుపోయాయి. ప్రస్తుతం యాసంగిలో ప్రాజెక్ట్ నుంచి సాగు నీరు విడుదల చేస్తే నీరు ముందుకు రాని విధంగా ముళ్లచెట్లు ఉన్నాయి. తీలేర్ పంపుహౌస్ నుంచి వచ్చిన డిస్ట్రిబూటర్ 16 కాల్వతోపాటు పిల్ల కాల్వల పరిస్థితి కూడా ముళ్లపొదలతో మూసుకుపోయాయి. పంపుహౌస్ నుంచి కన్మనూర్ వరకు 20కిలో మీటర్ల పొడవు ఉన్న ఈ కాల్వలో ముళ్లచెట్లతోపాటు పిచ్చిమొక్కలు భారీగా పెరగడంతో వానాకాలంలో నీళ్లు రాని పరిస్థితి ఏర్పడింది. ప్రాజెక్టు అధికారులు స్పందించి ముళ్లచెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.